కథ

# ఏం తక్కువని?

నేను రోజూ సాయంత్రం కూర్చునే పార్కులో నాకు వెంకట్రావు పరిచయమయేనాటికి అతని చిన్నకూతురు విజయకు సంబంధాలు వెదకటం మొదలుపెట్టి రెండేళ్లయింది. మా పరిచయం స్నేహంగా మారి కష్టసుఖాలు మాట్లాడుకోవడం, ఇళ్ల దగ్గర కలుసుకోవడం వరకు వచ్చి మరొక రెండేళ్లయింది.

కానీ విజయకు సంబంధం మాత్రం కుదరలేదు. అందుకు కారణం విజయ పెళ్లివారికి నచ్చకపోవడం కాదు. ఎందుకంటే విజయ విద్యాబుద్ధులున్న చక్కని పిల్ల. వంటపని, ఇంటి పనుల్లో దిట్ట. కమ్మగా పాడుతుంది. రానికుట్లు, అల్లికలు, చేతి పనులు లేవు. ఇంట్లో తల్లికి చేదోడు వాదోడుగా ఉంటూ తనకొచ్చిన విద్యలతో నెలకు ఐదారు వందల వరకు సంపాదిస్తోంది. అలాంటి పిల్లను కాదంటున్నారంటే వాళ్లడుగుతున్న కట్నం వెంకట్రావు ఇచ్చుకోలేకపోవడమేనని అనుకొనేవాడిని.

పిల్ల నచ్చితే, అనుకున్నదాని కంటే కట్నం కాస్త తక్కువైనా కొందరు ఒప్పుకుంటారు. బహుశా వెంకట్రావుకు అలాంటి వాళ్లింతవరకు తారసపడలేదేమో!

''కట్నం చాలా ఎక్కువగా అడుగుతున్నారా వెంకట్రావ్?'' అని అడిగానొకరోజు.

''అసలు నేను కట్నమే ఇవ్వననంటున్నాను. ఆ మాట వినగానే వెనక్కి వెళ్లిపోతున్నారు'' అన్నాడు.

నేను తెల్లబోయాను.

''అంటే కట్నం ఇవ్వకుండా పెళ్లి చేద్దామని అనుకుంటున్నావా? అది సాధ్యమేనా?'' అనడిగాను.

''ఎందుకు కాదు? మా పెద్దమ్మాయికి కట్నం ప్రసక్తి లేకుండానే పెళ్లి చేశాను. విజయకు కూడా అలాగే చెయ్యాలనుకుంటున్నాను. అయినా విజయకేం తక్కువని కట్నమివ్వాలి?''

''అంటే ఏదో తక్కువ కావడం వల్లనే అందరూ కట్నాలిచ్చి పెళ్లిళ్లు చేస్తున్నారంటావా?'' అని ప్రశ్నించాను.

''కాదు. కానీ సాంప్రదాయం, గోత్రం, జాతకాలు, నచ్చుకోవటాలు లాంటి సవాలక్ష అడ్డంకులు దాటి ముందుకు వచ్చిన సంబంధం కట్నం దగ్గర తప్పిపోతే ఉసూరుమంటుంది. వ్యయప్రయాసలకు ఓర్చి మళ్లీ మళ్లీ ప్రయత్నం చేసినా ఇవ్వదల్చిన కట్నానికే కుదురుతుందన్న గ్యారంటీ ఉండదు. ఆడపిల్లకు వీలైనంత వేగంగా పెళ్లి చేసెయ్యాలన్న ఆరాటంతో తల తాకట్టు పెట్టడానికైనా సిద్ధపడతారు. ఆడపిల్ల తల్లిదండ్రుల ఆరాటాన్ని మగపెళ్లివారు దర్జాగా క్యాష్ చేసుకుంటున్నారు'' అన్నాడు ఆవేశంగా.

''కట్నం పుచ్చుకోవటానికి ధన దాహమే కారణమంటావా వెంకట్రావ్?'' అని అడిగాను.

''ఖచ్చితంగా అంతే'' అన్నాడు వెంకట్రావు.

''ఎంతమాత్రం కాదు. అందరూ డబ్బు మీద వ్యామోహంతో కట్నం పుచ్చుకుంటారని మాత్రం అనుకోవద్దు'' అన్నాను.

''మరైతే దేని మీద వ్యామోహంతో పుచ్చుకుంటున్నారో?'' అన్నాడు వెంకట్రావు వెటకారంగా.

నేనతని వెటకారాన్ని పట్టించుకోలేదు.

''నీకున్నట్లే పెళ్లికెదిగిన కూతురు, ఉద్యోగం చేస్తున్న కొడుకు ఉన్నారనుకో, కూతురికి కట్నమిచ్చి పెళ్లి చెయ్యడానికి తగినంత డబ్బు లేదనుకో. అలాంటప్పుడు తప్పనిసరై కొడుక్కి కట్నం తీసుకొని పెళ్లి చేసి ఆ డబ్బుని కూతురు పెళ్లికి కట్నంగా వాడుకుంటారు'' అన్నాను.

''అంటే కొడుకుని అమ్మి అల్లుణ్ణి కొనడం అన్నమాట. చచ్చినా నేనలాంటి పని చెయ్యలేను'' అన్నాడు.

''పోనీ కుండ మార్పిడికి ప్రయత్నం చెయ్యకూడదూ'' అని అడిగేను.

''కుండమార్పిడి పద్ధతి మంచిదే. లోగడ అలాంటి సంబంధాలు కొన్ని వచ్చాయి కూడా. కానీ కుండమార్పిడి చేస్తే ఒక జంటకు సుఖసంతోషాలుండవంటూ మా ఆవిడ ఒప్పుకోలేదు.'' అన్నాడు.

చీకటి పడిందని ఇద్దరం ఇళ్లకు బయలుదేరేము.

కట్నమివ్వననే తండ్రి. కుండమార్పిడి కూడదనే తల్లి! కన్నవాళ్ల పట్టుదలల మధ్య నలిగిపోతున్న విజయకు ఎప్పుడు పెళ్లవుతుందో అనుకున్నాను ఇంట్లోకి వెళ్తూ.

కానీ విజయకు కట్నం ప్రసక్తి లేని చక్కని సంబంధం నా ద్వారానే కుదురుతుందని నేను కలలో కూడా అనుకోలేదు.

★★★

నేను, చలపతి కొంతకాలం కలిసి పనిచేశాం. రిటైరయినాక నేను హైదరాబాద్‌లో, చలపతి విశాఖపట్నంలో స్థిరపడ్డాము. మా మధ్య ఉత్తరప్రత్యుత్తరాలు లేవు కాని న్యూ ఇయర్ (గ్రీటింగ్సు) మాత్రం పంపుకొనే వాళ్లం. అందుకే ఆరోజు చలపతి దగ్గర్నుంచి ఉత్తరం వస్తే నాకు ఆశ్చర్యం కలిగింది.

''ఏం రాశాడబ్బా?'' అనుకుంటూ కవరు విప్పి ఉత్తరం చదివాను.

పోస్టల్ డిపార్టుమెంటులో అకౌంటెంటుగా పనిచేస్తున్న తన కొడుకు శ్రీధర్‌కు పెళ్లి చేయాలనుకుంటున్నానని, చాలా సంబంధాలు వస్తున్నా ఏదో కారణం వల్ల తప్పిపోతున్నాయని, సాంప్రదాయ కుటుంబానికి చెందిన విద్యాబుద్ధులున్న పిల్లయితే చాలని, ఉద్యోగం చేయనవసరం లేదని, కట్నం ప్రసక్తి లేదని వ్రాస్తూ, శ్రీధర్ తాలూకు వివరాలన్నీ తెలియజేశాడు. అదృష్టం విజయను వెదుక్కుంటూ వచ్చిందనిపించింది ఉత్తరం పూర్తిగా చదివాక.

నేను వెంటనే ఉత్తరం పట్టుకొని వెంకట్రావు ఇంటికి వెళ్లాను.

చలపతి రాసిన ఉత్తరం చదివి అతను ఎగిరి గంతేసినంత పని చేశాడు. అప్పటికప్పుడే చలపతి పేర వివరంగా ఉత్తరం రాసి విజయ జాతకం, ఫొటో పెట్టి కవరు పోస్టు చేసి వచ్చాడు.

ఫొటో నచ్చడంతోబాటు జాతకాలు కూడా కుదరడంతో వారం తిరక్కుండానే చలపతి భార్యను, కొడుకు శ్రీధర్‌ని తీసుకొని వచ్చి మా ఇంట్లో దిగేడు. అందరం కలిసి విజయను చూడటానికి వెళ్లేము.

విజయ, శ్రీధర్ పరస్పరం నచ్చుకున్నారు. ఇరుపక్షాల పెద్దలకు కూడా అన్నీ అంగీకారం కావడంతో వెంటనే పురోహితుడిని పిలిపించి నిశ్చితార్థానికి, పెళ్లికి ముహూర్తాలు పెట్టించేశారు. వాటి ప్రకారం మరునాడే నిశ్చితార్థం, నెల రోజుల్లో పెళ్లి ఘనంగా జరిగిపోయాయి.

''నా కూతుర్ని ఒకింటిదాన్ని చేసి నాకు మహోపకారం చేశారు గుర్నాథంగారూ! మీరు చేసిన మేలెప్పటికీ మర్చిపోలేను'' అన్నాడు వెంకట్రావు పెళ్లి రోజున నా చేతులు పట్టుకొని ఆనంద బాష్పాలు రాలుస్తూ.

వరకట్నాన్ని వ్యతిరేకించే ఇద్దరు మిత్రుల్ని వియ్యంకుల్ని చేయగల అవకాశం వచ్చినందుకు, అది సద్వినియోగమై పెళ్లి జరిగి అందరూ ఆనందించినందుకు నాకు చాలా తృప్తి కలిగింది.

విజయ సంతోషంగా అత్తవారింటికి వెళ్లిపోయింది.

నేను, మా ఆవిడ ఉత్తరదేశ యాత్రలు చేసి



ఢిల్లీలో ఉంటున్న మా అబ్బాయి దగ్గర కొంత కాలం ఉన్నాము. తిరుగు ప్రయాణంలో మా అమ్మాయి దగ్గర కలకత్తాలో కొన్ని రోజులుండి పూరీ యాత్ర చేసేము.

శ్రీకాకుళం వచ్చి నా బాల్య మిత్రుడు జగన్నాథం ఇంట్లో రెండు రోజులుండి అరసవల్లి, శ్రీకూర్మం చూసి తిన్నగా హైదరాబాద్ వచ్చేశాము. ఏడెనిమిది నెలలపాటు మూసి ఉండటంతో ఇల్లంతా దుమ్ము పట్టి వుంది. ఇల్లు శుభ్రం చేసుకొని, వెచ్చాలు తెచ్చుకొని రొటీన్‌లో పడటానికి వారం రోజులు పట్టింది.

ఆరోజు సాయంత్రం తీరిగ్గా వెంకట్రావుని కలుద్దామని వాళ్లింటి వైపు వెళ్లాను.

గుమ్మంలోనే వాళ్లింటి ఓనరు సత్యమూర్తి గారు ఎదురై ''రండి, చాలా రోజులకి కనబడ్డారు. బాగున్నారా?'' అంటూ లోపలికి తీసుకొని వెళ్లారు.

ఆ మాటా ఈ మాటా అయ్యాక వెంకట్రావు గురించి అడిగాను.

''వాళ్లబ్బాయి ఆనంద్‌కి ఆఫీసరుగా ప్రమోషను వచ్చింది గుర్నాధంగారూ! క్వార్టర్సు ఇచ్చారు. నాలుగు నెలల క్రితమే అక్కడికి వెళ్లిపోయారు'' అని చెప్పారు.

''అలాగా! చాలా మంచి వార్త చెప్పారు. మరి వాళ్ల అడ్రసు మీ దగ్గరుందా?'' అని అడిగాను.

''ఉంది. మీరొస్తే ఇమ్మని వెంకట్రావు అడ్రసు రాసి ఇచ్చాడు లెండి'' అంటూ అడ్రసు కాగితం డైరీలోంచి తీసి ఇచ్చారు.

''ఆనంద్‌కి పెళ్లి చేసేడా?'' అని అడిగాను.

''నెల క్రితమే ఒక పెళ్లిలో కలిసేము. సంబంధాలు చాలా వస్తున్నాయిట. కానీ ఏదీ నిశ్చయం చెయ్యలేదని చెప్పాడు'' అన్నారు సత్యమూర్తి గారు.

కొంతసేపుండి నేనతని దగ్గర సెలవు తీసుకొని ఇంటికి వచ్చేశాను.

★★★

మర్నాడు మధ్యాహ్నం వెంకట్రావు ఇంటికి బయలుదేరుతూ మా ఆవిడని కూడా రమ్మన్నాను.

కానీ తనకింకా బడలిక తీరలేదని రాలేనని అనడంతో నేనొక్కడినే బయలుదేరాను.

రెండు బస్సులు మారి క్వార్టర్సుకి చేరడానికి గంటన్నర పైగా పట్టింది. అడ్రసు సరిగా ఉండటంతో శ్రమ లేకుండానే ఇల్లు కనుక్కోగలిగాను.

బెల్ నొక్కగానే రమణమ్మ వచ్చి తలుపు తీసింది. ఆదరంగా పలకరించి లోపలికి ఆహ్వానించింది.

హాల్లో సోఫాలో కూర్చొని కార్డ్‌లేస్‌లో ఎవరితోనో మాట్లాడుతున్న వెంకట్రావు కళ్లతోనే పలకరించి కూర్చోమని సైగ చేసి ఫోనులో మాట్లాడుతూనే లోపలికి వెళ్లేడు. రమణమ్మ చల్లని మంచి నీళ్లిచ్చింది.

''వదినగారు కూడా వస్తే బాగుండేది. పిల్లలు బాగున్నారా? యాత్రలు బాగా జరిగాయా?'' అంటూ ప్రశ్నించింది.

**జి.సరస్వతి**

అంతా బాగున్నారని, మా యాత్రలన్నీ బాగా జరిగాయని, మా ఆవిడను మరోసారి వచ్చినప్పుడు తీసుకొస్తానని చెప్పాను.

ఇంతలో వెంకట్రావు కూడా వచ్చి నా ఎదురుగా ఉన్న సోఫాలో భార్య ప్రక్కన కూర్చున్నాడు. నీటుగా, ఆరోగ్యంగా కనబడుతున్న వాళ్లిద్దరినీ చూస్తుంటే నాకు చాలా సంతోషం కలిగింది.

ఆనంద్ ఆఫీసరవడంతోనే వీళ్ళ కష్టాలు గట్టెక్కాయి. దర్జాగా, సుఖంగా ఉన్నట్లు కనబడుతున్నారు అనుకున్నాను మనస్ఫూర్తిగా సంతోషిస్తూ.

''మా ఆనంద్‌కి పెళ్లి చేసేక మేము కూడా తీర్థయాత్రలకు వెళ్దామనుకుంటున్నాము గుర్నాథం గారూ'' అన్నాడు వెంకట్రావు మాటల మధ్యలో.


''మంచి ఆలోచనే. మీ ఆనంద్‌కి చాలా సంబంధాలు వస్తున్నాయిటకదా! సత్యమూర్తిగారు చెప్పేరులే!'' అన్నాడు.

''ఔను గుర్నాధంగారూ! ఉత్తరాలకు, ఫోన్‌కాల్స్‌కు లెక్క ఉండటం లేదు. ఇంక ఇంటికి డైరెక్టుగా వచ్చేవాళ్లు ఎందరో. సమాధానాలు చెప్పలేక సతమతమైపోతున్నామనుకోండి'' అన్నాడు వెంకట్రావు గర్వం తొణికిసలాడుతున్న గొంతుతో.

''కట్నం ప్రసక్తి లేకుండా మీ ఇంటి కోడలయ్యే అదృష్టం ఏ పిల్లకు పడుతుందో మరి'' అన్నాను.

నా మాటలకు మొహం చిట్లిస్తూ, ''కట్నం ప్రసక్తి లేకపోవడమేమిటి గుర్నాధంగారూ! మా ఆనంద్‌కేం తక్కువని కట్నం మానెయ్యాలి?'' అన్నాడు వెంకట్రావు.

ఆరోజు 'మా విజయకేం తక్కువని కట్నం







ఇవ్వాలి' అనడిగిన వెంకట్రావు, ఈరోజు 'మా ఆనంద్‌కేం తక్కువని కట్నం పుచ్చుకోకూడదు?' అని అంటూంటే నాకు ఆశ్చర్యంతో నోట మాట

## సుస్మిత పెళ్లి

మొత్తానికి సుస్మిత పెళ్లికి వప్పుకుందండోయ్! సంజయ్ నారంగ్ వరుడు. ఫిబ్రవరి సెకండ్, 2002లో వివాహం నిశ్చయించారు. సో, ఇప్పటి నుంచే షాపింగ్‌కి ప్రిపేరవుతోందిట సుస్మిత. (మరీ బడాయి కాకుంటే ఇంత తొందరగానా?) అయినా ఆమె ఇచ్చిన డేట్‌లోగా ఎన్ని మార్పులొస్తాయో మనం చదవొచ్చు కదూ! అంతవరకూ ఇంతే సంగతులు!

-విరజ



రాలేదు.

కొంతసేపటికి తేరుకొని ''నువ్వు వరకట్నాన్ని వ్యతిరేకించే వాడివి కదా!'' అన్నాను.

''అది మా అమ్మాయిల పెళ్లిళ్లప్పుడు. ఇప్పుడు నేను చెయ్యబోయేది అబ్బాయి పెళ్లి. కట్నం వద్దంటే ఏదో లోపముందని అనుమానించి వచ్చిన వాళ్లు వెనక్కి వెళ్లిపోతారు. వాడికొచ్చే సంబంధాలు కట్నం వద్దని చెప్పి చెడగొట్టడం నాకిష్టం లేదు'' అన్నాడు.

''మరి మీ అల్లుళ్లిద్దరూ కట్నాలు తీసుకోలేదు కదా! నువ్వు అనుమానాలు పెట్టుకోకుండా కూతుళ్లనిచ్చేవుకదా'' అన్నాను.

''నేను కనుక ఇచ్చేను కానీ అందరూ నాలాగా ఉంటారా ఏమిటి?'' అన్నాడు.

''పోనీ నీలాగే అనుమానాలు పెట్టుకోకుండా పిల్లనిచ్చేవాళ్లుంటే కట్నం లేని పెళ్లి చేస్తావా?'' అని ప్రశ్నించాను వదలకుండా.

వెంకట్రావుకు నా మాటలు మింగుడు పడలేదు కాబోలు. నా వైపు కొరకొరా చూశాడు. అంతవరకు మా వాదనలు వింటూ మౌనంగా ఉన్న రమణమ్మ అందుకొని, ''అది కుదురదు లెండి అన్నయ్యగారూ!'' అంది.

''ఏంచేతమ్మా?'' అని అడిగాను.

''మీతో చెప్పటానికి మొహమాటమెందుకు గానీ కట్నం, లాంఛనాలు కలిపి రెండు లక్షలకు పైగా ముట్టజెప్తామని చాలామంది వస్తున్నారు. మాకూ ఆనంద్ ఒక్కకొడుకు. వాడి పెళ్లితో ముద్దూ ముచ్చటా తీర్చుకోవాలని తల్లిదండ్రులుగా మాకు, తోబుట్టువులుగానూ అమ్మాయిలకు ఉండటం సహజమే కదా! అలాంటి కలిగినింటి సంబంధం మీ దృష్టిలో కూడా ఏదైనా ఉంటే చెప్పండి. తప్పకుండా చేసుకుంటాము. ధనలక్ష్మితో ఇంట్లో అడుగుపెట్టిన అమ్మాయిని పువ్వుల్లో పెట్టి చూసుకుంటాము'' అంది రమణమ్మ.

ఆవిడ మాటలతో వాళ్ల సంగతి పూర్తిగా అర్థమైంది.

ఆనంద్ ఆఫీసరవగానే అంతస్థు పెరిగిందని, దాని క్రింద వెంకట్రావు వల్లించే ఆదర్శం అణగారిపోయిందని, భార్యాభర్తలకు ధనదాహం పట్టుకుందని తేటతెల్లమైంది.

నేను ఊరినించి వచ్చేసరికి ఆనంద్‌కి పెళ్లి నిశ్చయం కాకుండా ఉండి ఉంటే, రూపగుణ విద్యాసంపన్న అయిన మా జగన్నాథం కూతురు సుజాతను ప్రపోజ్ చేద్దామని, సుజాత ఆనంద్‌కి తగిన భార్య, ఆ ఇంటికి తగిన కోడలు అవుతుందని అనుకున్నాను. సుజాత పెళ్లి చేయించి జగన్నాథం గుండె బరువు దించుదామనుకున్నాను. కానీ వెంకట్రావు దంపతుల ధోరణి చూశాక అది అసాధ్యమని తోచింది.

''నాకు తెలిసిన పిల్ల లక్షణమైనదే కాని లక్షలు మాత్రం తేలేనిదమ్మా! వస్తాను'' అని చెప్పేసి బైటకు నడిచాను.

బస్సులో కండక్టరుకు డబ్బులివ్వడానికి జేబులో చేయి పెట్టేసరికి సుజాత ఫొటో ఉన్న కవరు తగిలి మనస్సును బరువెక్కించింది.